నిశాచర ప్రపంచం పిలుస్తోంది..!

SUNDAY SPECIAL

- జూ పార్కులో ప్రత్యేక ఆకర్షణగా చీకటి గుహ
- సందర్శకులను ఆకట్టుకుంటున్న నిశాచర జీవులు
- కార్తీక మాసంలో చూసొద్దాం రండి

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో వందల కొలది వన్యప్రాణులున్నాయి. జూ అనగానే ముందుగా మనకు గుర్తొచ్చేవి పులి, ఏనుగు, కోతి, నెమలి, పక్షులు, పాములు, జింకలు, తదితర వన్యప్రాణులు. సాధారణంగా జీవులు అనగానే మనకు కనిపించే వాటి పేర్లు మాత్రమే చెబుతాం. మనకు కనిపించే వన్నీ పగటిపూట సంచరిస్తాయి. రాత్రులు కూడా సంచరించే నిశాచర జీవులు కూడా ఉన్నాయి. జూ పార్కులో ప్రత్యేకంగా వాటి కోసం ఓ గుహ ఉంది. దీన్ని నిశాచర జీవుల గుహ(నాక్టర్నల్ హోమ్) అని పిలుస్తారు. దీన్ని జూ పార్కులో ప్రధాన ద్వారం నుంచి లోపల కుడి వైపు పెద్ద మర్రి చెట్టు ఎదురుగా నిర్మించారు. ఇందులో రాత్రిళ్లు సంచరించి పగలు నిద్రపోయే నిశాచర జీవులున్నాయి. ఈ రెండు రకాల వన్యప్రాణులు కూడా జూలో సందర్శకులకు కనిపిస్తాయి. వీటి కోసం జూ అధికారులు ప్రత్యేకంగా ఓ గుహ నిర్మించారు. దానిలో రాత్రిని తలపించేలా నిత్యం చీకటిగా ఉండేటట్లు ఏర్పాటు చేశారు. దాని లోపలకు వెళ్లే సందర్శకులకు అంతా చీకటిగానే ఉంటుంది. దానిలోనే చిన్న విద్యుత్ దీపాల వెలుగులో నిశాచర జీవులు కనిపిస్తాయి. వాటికి వేర్వేరుగా గదులు ఏర్పాటు చేశారు. దీనిలో గుడ్లగూబలు, గబ్బిలాలు, అడవి పిల్లులు, పునుగు పిల్లులు, ముళ్ల పందులు తదితర జీవులున్నాయి. జూకు వెళ్లేవారు ఈ గుహను సందర్శిస్తే అవి కనిపిస్తాయి. వాటి గురించి తెలుసుకోవచ్చు. ఈ గుహ లోపలకు వెళ్లడానికి పెద్దలకు రూ.5, పిల్లలకు రూ.2 చెల్లించి టికెట్ తీసుకోవాలి. ఆ గుహ ముందే టికెట్లు ఇస్తారు. నిశాచర జీవులన్నీ సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.



జూ పార్కులో నిశాచర జీవుల గుహ

గుడ్లగూబలు



గుడ్లగూబలు అనేక ప్రాంతాల్లో కనిపిస్తాయి. రాత్రిళ్లు అరుస్తు పైన ఎగురుతుంటాయి. వీటి ముఖం గుండ్రంగా ఉండి పెద్ద కళ్లు ముందుకు కనిపిస్తాయి. ఇవి ప్రత్యేకమైన కంటి దృష్టి కలిగి ఉంటాయి. ఒక్కొక్కటి ఒకటిన్నర నుంచి 2 కిలోల బరువు ఉంటాయి. వీటి జీవిత కాలం సుమారు 13 నుంచి 15 ఏళ్లు. ఈ గుహలో రెండు గుడ్ల గూబలున్నాయి. వీటితోపాటు గబ్బిలాలు సుమారు 20 వరకు ఇక్కడ ఉన్నాయి.

ముళ్లపందులు



ముళ్లపందులు మధ్య ఆసియా, ఆగ్నేయ ఆసియా, తూర్పు ప్రాంతాల్లో ఎక్కువగా సంచరిస్తాయి. ఆంధ్రప్రదేశ్ అడవుల్లోనూ ఎక్కువ సంఖ్యలో తిరుగుతాయి. అన్ని రకాలైన వాతావరణ పరిస్థితులను ఇవి అనుకూలంగా మలచుకొని జీవిస్తాయి. ఇవి శాకాహార జీవులు. పళ్లు, దుంపలు ఎక్కువగా తింటాయి. ఇవి రెండున్నర నుంచి 4 కిలోల బరువు ఉంటాయి. పుట్టినప్పటి నుంచి వీటి శరీరంపై దట్టమైన వెంట్రుకలు ఉంటాయి. అవి పెరుగుతున్న కొలది రూపాంతరం చెంది గట్టిపడి బలమైన ముళ్లుగా మారుతాయి. ఈ ముళ్లతో ఇవి వాటిపై దాడి చేసే జంతువుల నుంచి వాటిని అవే రక్షించుకుంటాయి. వీటి జీవిత కాలం సుమారు 25 నుంచి 30 ఏళ్లు. జూ గుహలో 8 ముళ్ల పందులున్నాయి.

అడవి పిల్లి



దేశంలోని అన్ని ప్రాంతాల అడవుల్లోనూ అడవి పిల్లులు సంచరిస్తాయి. సాధారణంగా ఇవి గడ్డి మైదానాల్లో ఎక్కువగా జీవిస్తాయి. ఇవి 4 నుంచి 15 కిలోల బరువు, 70 నుంచి 120 సెంటీ మీటర్లు పొడవు ఉంటాయి. ఇవి కీటకాలను ఆహారంగా తీసుకుంటాయి. వీటి జీవిత కాలం సుమారు 20 ఏళ్లు. ఈ గుహలో ఒక అడవి పిల్లి ఉంది.

మాను పిల్లి



మాను పిల్లి జాతి ఆసియా ఖండంలో అన్ని చోట్లా అడవుల్లో సంచరిస్తాయి. ఇవి చిన్న పరిణామంలో ఉంటాయి. 2 నుంచి 3 కిలోల బరువు, పొడవైన తోక కలిగి ఉంటాయి. వీటి జీవిత కాలం 20 నుంచి 24 ఏళ్లు. ఇక్కడ గుహలో ఒక మాను పిల్లి ఉంది.

క్లుప్తంగా

మాలధారులకు ఉచిత భిక్ష ప్రారంభం



స్వాములకు భోజనాలు వడ్డిస్తున్న జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ సోమన్నారాయణ

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు చినగదిలి నార్త్ షిర్డీసాయిబాబా మందిరంలో శనివారం అయ్యప్ప మాలధారులకు ఉచిత భిక్ష కార్యక్రమం ప్రారంభమైంది. ఇది మకర సంక్రాంతి వరకు కొనసాగుతుంది. కార్యక్రమాన్ని జీవీఎంసీ అదనపు కమిషనర్ జి.సోమన్నారాయణ ప్రారంభించి స్వాములకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందిర నిర్వాహకులు మాలధారులకు మధ్యాహ్నం భిక్ష ఉచితంగా పెట్టడం అభినందనీయమన్నారు. ఆలయం చైర్మన్ వానపల్లి అప్పారావు మాట్లాడుతూ ప్రతి ఏటా అయ్యప్ప స్వాములకు ఉచితంగా మధ్యాహ్నం భోజనాలు పెడుతున్నామన్నారు. ఈ ఏడాది కూడా మకర సంక్రాంతి వరకు నిరాటంకంగా అన్నప్రసాద వితరణ కొనసాగిస్తామని చెప్పారు.

బీచ్‌లో ఎండోవాక్

మహారాణిపేట: ఎండోక్రైనాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం ఎండో వాక్ జరిగింది. ఆర్.కె.బీచ్ వద్ద మొదలైన నడక వైఎంసీఏ వరకు సాగింది. కార్యక్రమంలో ఎండోక్రైనాలజీ సొసైటీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పి.కె.జబ్బర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.వి.ఎస్.హరికృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కె.ఎ.వి.సుబ్రహ్మణ్యం, డాక్టర్లు మైథలీ, డాక్టర్ జయంతి రమేష్, డాక్టర్ పద్మలత, డాక్టర్ దిలీప్‌కుమార్, డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

సింహాద్రినాథుడికి మొక్కుల చెల్లింపు



గంగిరెద్దును ఊరేగిస్తున్న సేవా గరిడీ బృందం, సంఘు సభ్యులు

మద్దిలపాలెం: ప్రతి ఏటా కార్తీక మాసంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించే సింహాద్రినాథుడి మొక్కులు చెల్లింపు వేడుక పాత వెంకోజీపాలెం శ్రీ రాధాకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగిరెద్దుకు ప్రత్యేక అలంకరణ చేసి ఒమ్మి జగ్గప్ప సేవా గరిడీ ఆధ్వర్యంలో గ్రామంలో ఊరేగించారు. అప్పన్నను దర్శనం చేసుకుని, సహపంక్తి భోజనం చేశారు. సంఘు పెద్దలు, గ్రామస్తులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

మహారాష్ట్ర ఎన్నికల కాంగ్రెస్ కో ఆర్డినేటర్‌గా నారాయణరావు



బీచ్‌రోడ్డు: త్వరలో జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు కో ఆర్డినేటర్‌గా నగరానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జి.ఎ.నారాయణరావును ఏఐసీసీ నియమించింది. గతంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, ఉత్తరాంధ్ర ఏజెన్సీ జిల్లాల ఇన్‌చార్జిగా వ్యవహరించిన ఆయనకు ఏఐసీసీ కమిటీల్లో పనిచేసిన అనుభవం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఏఐసీసీ మహారాష్ట్రలో తెలుగు వారు ఎక్కువగా ఉన్న కొల్హాపూర్ జిల్లాలోని కొన్ని నియోజకవర్గాలను బాధ్యతలు కూడా ఆయనకు అప్పజెప్పింది. ఈ సందర్భంగా పార్టీ అధినేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీలకు నారాయణరావువ కృతజ్ఞతలు తెలియజేశారు.

వేంకటేశ్వర స్వామికి శ్రవణ నక్షత్ర పూజలు



తులసిమాలల అలంకరణలో వెంకన్న

మద్దిలపాలెం: శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని శనివారం కొత్త వెంకోజీపాలెం రామాలయంలో కొలువైన వైభవ వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు కిషోర్‌శర్మ భక్తుల పేరిట అభిషేకాలు చేసి, స్వామిని తులసిమాలలతో విశేషంగా అలకంరించారు. సాయంత్రం మహిళలు ధ్వజ స్తంభం వద్ద ఆకాశజ్యోతిని వెలిగించారు. శ్రవణ నక్షత్రం సందర్భంగా వైష్ణవ ఆలయాలన్నీ భక్తులతో నిండిపోయాయి.

'చిత్రలేఖనం' విజేతలకు కలెక్టర్ అభినందన



బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

ఆరిలోవ: శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాన్ని శనివారం కలెక్టర్ హరేందిర ప్రసాద్ సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం, వసతి, విద్య తదితర అంశాలపై ఆరా తీశారు. ఇటీవల ప్రకాశం జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీల్లో గురుకుల విద్యార్థులు జయసాయి, జయబాబు, దిలీప్, అఖిలానంద్, దివ్యానిష్, డ్రాయింగ్ టీచర్ సుధాకర్ బంగారు పతకాలు సాధించారు. వీరిని కలెక్టర్ అభినందించారు. విద్యార్థులను ఉత్తమ ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. మొక్కుబడిగా పనిచేయవద్దని స్పష్టంచేశారు. జిల్లా గురుకులాల సమన్వయాధికారి ఎస్.రూపావతి, ప్రిన్సిపాల్ రత్నవల్లి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

11, 12 తేదీల్లో ఏయూలో జాతీయ సదస్సు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 11, 12 తేదీల్లో జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు విభాగాధిపతి, సదస్సు డైరెక్టర్ టి.షారోన్‌రాజు తెలిపారు. శనివారం ఉదయం విద్యా విభాగంలో సదస్సు వివరాలను ఆయన వెల్లడించారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ సహకారంతో 'ఈక్విటీ, డైవర్సిటీ అండ్ ఇంక్లూజన్ ఎన్ఈపీ 2020 ఇష్యూస్, కన్సర్న్స్ అండ్ చాలెంజెస్' అనే అంశంపై సదస్సు జరుగుతుందన్నారు. ఏయూ ప్లాటినం జూబ్లీ గెస్ట్‌హౌస్‌లో 11వ తేదీ సోమవారం సదస్సును ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు ప్రారంభిస్తారని చెప్పారు. నూతన విద్యావిధానం 2020 అమలు, అనంతరం అంశాలపై నిపుణులు చర్చిస్తారన్నారు. ప్రధానంగా నాణ్యమైన టీచర్ల శిక్షణ అవసరాన్ని సూచించడం, గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సైతం నూతన విద్యా విధానం అందుబాటులో ఉండేలా చూడటం, వైవిధ్యమైన విద్యార్థుల కోసం అనుకూలమైన నూతన పాఠ్య కార్యక్రమం అభివృద్ధి వంటి అంశాలను రెండు రోజుల సదస్సులో చర్చించనున్నారని పేర్కొన్నారు. పోర్టు అథారిటీ కార్యదర్శి టి.వేణుగోపాల్, మను కేంద్రీయ విద్యాలయం ఆచార్యులు పి.ఆడం పాల్ పాటేటి, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్ ప్రొఫెసర్ స్వరూపారాణి, పలువురు వక్తలు పాల్గొని ప్రసంగించనున్నారని షారోన్‌రాజు తెలిపారు.

సందేశాత్మకంగా 'భూతకాలం'

ముగిసిన రసజ్ఞ జాతీయ నాటకోత్సవాలు



భూతకాలం నాటకంలోని ఓ సన్నివేశం



భూతకాలం నాటక బృందంతో ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు

మద్దిలపాలెం: జీవితం అనేది ఒక అద్భుతమైన బహుమతి. ఆ బహుమతిని పూర్తిగా ఆస్వాదించాలంటే భూతకాలాన్ని వదిలిపెట్టి.. వర్తమానంలో జీవించడం నేర్చుకోవాలనే సందేశంతో ప్రదర్శించిన 'భూతకాలం' నాటకం ప్రేక్షకుల హృదయాలను కట్టిపడేసింది. కళాభారతి ఆడిటోరియంలో మూడు రోజులుగా జరుగుతున్న రసజ్ఞ 9వ జాతీయ నాటకోత్సవాలు శనివారంతో ముగిశాయి. చివరి నాటకంగా హైదరాబాద్‌కు చెందిన గోవాడ క్రియేషన్ కళాకారులు భూతకాలం నాటకాన్ని ప్రదర్శించారు. ముందుగా మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, ఏయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, వీఎండీఏ కార్యదర్శి గుమ్ములూరి రాంబాబు, పైడా కృష్ణ ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి నాటక ప్రదర్శను ప్రారంభించారు. యువతరం నటీనటులు తమ ప్రతిభతో అందరి హృదయాలను దోచుకున్నారు. దివాకర్ బాబు మాడభూషి రచించిన భూతకాలం కథను ప్రముఖ నటుడు, దర్శకుడు డాక్టర్ వెంకట్ గోవాడ దర్శకత్వం వహించారు. రసజ్ఞ వ్యవస్థాపకుడు వేమలి త్రినాథరావు పాల్గొన్నారు.

పల్లా అప్పారావుకు నేతల నివాళి



పల్లా అప్పారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గుడివాడ అమర్‌నాథ్ తదితరులు

బీచ్‌రోడ్డు: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన జీవీఎంసీ 28వ వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ భర్త పల్లా అప్పారావుకు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు ఆధ్వర్యంలో శనివారం రామ్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, నాయకులు రవిరెడ్డి, గొలగాని శ్రీనివాస్ తదితరులు పల్లా అప్పారావు చిత్రపటం వద్ద సంతాపం తెలిపారు.

నేత్రపర్వం.. శ్రీరామ పట్టాభిషేకం



శ్రీరామ పట్టాభిషేకం నిర్వహిస్తున్న హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ సభ్యులు

మద్దిలపాలెం: హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం మద్దిలపాలెంలో సుందరకాండ హోమం, శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఈ వేడుకల్లో 31 జంటలు భక్తిశ్రద్ధలతో పాల్గొని శ్రీరామచంద్ర స్వామి పట్టాభిషేకాన్ని అంగరంగ వైభవంగా జరిపించాయి. సీతారాములు, లక్ష్మణ, ఆంజనేయ స్వాముల విగ్రహాలను అలంకరించి విశేష పూజలు చేశారు. రెండు సముద్రాలు, 38 నదుల నుంచి తీసుకొచ్చిన జలాలతో స్వామి వార్లను అభిషేకించారు. పంచామృతాలు, అనేక పండ్ల రసాలతో అభిషేకం చేశారు. ముందుగా యువతులు, అనంతరం భక్తులందరి చేత అభిషేకం చేయించారు మంత్ర పుష్పాలు, మంగళహారతులతో కార్యక్రమాన్ని ముగించారు. శతాధిక రామాయణ పారాయణం చేసిన డాక్టర్ గుములూరి రాంబాబు ఆధ్వర్యంలో వేద పండితులు చిరంజీవి అవధాని-వెంకటేశ్వరరావు మంత్రోచ్చారణలతో కార్యక్రమం కొనసాగించారు. భక్తులకు అయోధ్య నుంచి తీసుకొచ్చిన సిల్వర్ డాలర్లు ఇచ్చి పూజ చేయించేశారు. అయోధ్య నుంచి వచ్చిన రాములు వారి స్కార్ఫ్ కూడా భక్తులందరిపై వేసి ఆశీర్వదించారు.

బాలికల గృహంలో దాడులపై ఆందోళన



ప్రభుత్వ ప్రత్యేక బాలికల గృహం

ఆరిలోవ: ప్రభుత్వ ప్రత్యేక బాలికల గృహంలో సిబ్బందిపై బాలికలు దాడులకు దిగుతున్నారు. దీంతో సిబ్బంది ఇక్కడ పనిచేయడానికి ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. ఈ ఘటనపై రెండు రోజుల కిందట ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాలిలా.. విశాఖ వ్యాలీ స్కూల్ రోడ్డులోని ప్రభుత్వ బాలికల గృహంలో ఈ నెల 2న కుమారి అనే హెల్పర్ విధులు ముగించుకొని ఇంటికి బయలుదేరుతున్న సమయంలో ఐదుగురు బాలికలు(ఓపెన్ ఇంటర్మీడియట్ చదువుతున్నారు) ఆమెపై దాడికి దిగారు. ఆమె స్కూటీపై పెద్ద రాళ్లతో బాది పనికిరాకుండా చేశారు. ఈ విషయాన్ని కుమారి బాలికల గృహం సూపరింటెండెంట్ ఎస్.సునీత దృష్టికి తీసుకెళ్లారు. ఆమె నుంచి సరైన స్పందన లేకపోవడంతో ఈ నెల 5న ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఐదుగురు బాలికలు తనపై దాడిచేసి, తన స్కూటీని పనికిరాకుండా చేశారని, తరచూ తనను హెచ్చరిస్తున్నారంటూ ఫిర్యాదులో కుమారి పేర్కొన్నారు. దర్యాప్తులో భాగంగా ఈ నెల 6న ఆరిలోవ పోలీసులు బాలికల గృహానికి వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న చిల్డ్రన్ వెల్ఫేర్ కమిటీ(సీడబ్ల్యూసీ) సభ్యులు, ప్రభుత్వ బాలుర పరిశీలనా గృహం సూపరింటెండెంట్ వీరయ్య అక్కడికి చేరుకున్నారు. వారు పోలీసుల సమక్షంలో దాడికి పాల్పడిన ఐదుగురు బాలికలను విచారించారు. బాలికలు గ్రూపులుగా సిబ్బందిపై దాడులకు దిగుతున్న విషయం వెల్లడి కావడంతో అవాక్కయ్యారు. హెల్పర్ కుమారిపై దాడికి దిగిన ఐదుగురిని వేరే గృహాలకు గాని, వారి తల్లిదండ్రులకు గాని అప్పగించేయాలని వారంతా సూపరింటెండెంట్‌కు సూచించారు. తరచూ ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా.. ఇక్కడ సూపరింటెండెంట్ ఉన్నతాధికారులు, సీడబ్ల్యూసీ దృష్టికి తీసుకెళ్లకుండా ఎందుకు దాచిపెడుతున్నారోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఘటనపై సూపరింటెండెంట్ సునీతను శనివారం వివరణ కోరగా.. దాడి చేసిన వారిలో ఇద్దరు బాలికలను వారి తల్లిదండ్రులను పిలిపించి అప్పగించేశామని తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతుండటంతో ఇక్కడ అధికారుల పర్యవేక్షణపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

పోలింగ్ కేంద్రం సందర్శన



పోలింగ్ కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్ బీవీకే పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని శనివారం కలెక్టర్ హరేందిర ప్రసాద్ సందర్శించారు. ఈ కేంద్రానికి అవసరమైన వసతులు, పరిస్థితులు, సౌకర్యాలను పరిశీలించారు. ఇటీవల విడుదల చేసిన ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, కొత్తగా ఓటర్ల నమోదు అవకాశం కల్పించారు. వాటికి సంబంధించిన వివరాలను కలెక్టర్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సందర్శనలో రెవెన్యూ విభాగం, ఎన్నికల విభాగం అధికారులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

శిశువుకు మెడికవర్ వైద్యుల పునర్జన్మ



శిశువును తల్లి సంరక్షణకు అప్పగిస్తున్న మెడికవర్ ఆస్పత్రి వైద్యుల బృందం

ఎంవీపీకాలనీ: 510 గ్రాముల బరువుతో జన్మించిన శిశువును ఎంవీపీ కాలనీలోని మెడికవర్ వైద్యులు సంరక్షించారు. విజయనగరానికి చెందిన రమాదేవికి 25 వారాల ముందస్తు ప్రసవం కారణంగా శిశువు అవయవాలు పూర్తిగా పరిపక్వత చెందలేదు. డాక్టర్ సాయి సునీల్ కిశోర్, డాక్టర్ మౌనిక, డాక్టర్ విజయ్, డాక్టర్ శ్రీరాంలతో కూడిన ఆస్పత్రి నియోనాటాలజిస్టుల బృందం ఈ శిశువు సంరక్షణను సవాల్‌గా స్వీకరించింది. 107 రోజుల పాటు వైద్య సేవలందించి శిశువుకు పునర్జన్మనిచ్చింది. అపరిపక్వంగా ఉన్న శిశువు ఊపిరితిత్తులను అభివృద్ధి చేసేందుకు, పనితీరును మెరుగుపరచేందుకు వీలుగా వైద్యులు సర్ఫాక్టెంట్ ఇంజెక్షన్లను అందించారు. శ్వాస తీసుకోవడంలో సహాయపడేందుకు 25 రోజులు ఇన్వాసివ్ వెంటిలేషన్, మరో 30 రోజులు నాన్ ఇన్వాసివ్ వెంటిలేషన్ అందించారు. శిశువు సన్నని కేంద్ర రేఖల ద్వారా పోషకాహారం అందించడంతో పాటు ప్రత్యేకమైన పాలు అందించారు. వైద్యుల కృషి ఫలితంగా 510 గ్రాముల బరువున్న శిశువు 1.65 కిలోలకు పెరిగి ఆరోగ్యంగా ఉంది. శిశువును శనివారం తల్లికి అప్పగించారు. ఈ సందర్భంగా వైద్యులకు రమాదేవి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆస్పత్రి యాజమాన్యం అభినందించింది.

ఉత్సాహంగా బీచ్ క్లీనింగ్



సాగర తీర శుభ్రతలో పాల్గొన్న మేనేజ్‌మెంట్ విద్యార్థులు

ఏయూక్యాంపస్: సాగర తీరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(సిమ్స్) విద్యార్థులు భాగమయ్యారు. కళాశాలలో నిర్వహిస్తున్న మేనేజ్‌మెంట్‌లో భాగంగా శనివారం బీచ్ క్లీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. పలువురు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వ్యర్థాలను ఏరివేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ దీపికా దాస్, ఎన్ఎస్ఎస్ అధికారి జి.సుధాకర్, ప్రిన్సిపాళ్లు డాక్టర్ అలక్ చంద్రుడు, డాక్టర్ యు.లారెన్స్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా లేడీస్ పిక్నిక్



క్యాట్ వాక్ చేస్తున్న మహిళలు



విజేతకు బహుమతి అందిస్తున్న మిసెస్ ఇండియా హేమలతా రెడ్డి

ఏయూక్యాంపస్: నిత్యం కుటుంబ బాధ్యతలు, ఉద్యోగ విధులతో బిజీబిజీగా గడిపే మహిళలు కాస్త ఆటవిడుపు తీసుకున్నారు. బీచ్ రోడ్డులోని ఎంజీఎం పార్క్ ఆవరణలో కార్తీక మాస వనభోజనాన్ని తలపిస్తూ శనివారం నిర్వహించిన లేడీస్ పిక్నిక్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో సందడి చేశారు. మహిళలు తమలో దాగి ఉన్న కళాప్రతిభను వేదికపై ప్రదర్శించారు. రెండు పదుల వయసున్న యువతుల నుంచి, గృహిణులు, వృద్ధులు సైతం పిక్నిక్‌లో భాగమై సేదతీరారు. మహిళల క్యాట్ వాక్ ఆకట్టుకుంది. సంప్రదాయ చీరకట్టుతో పలువురు మహిళలు పాల్గొనగా.. మరికొంత మంది ఆధునిక వస్త్రధారణతో తళుక్కుమన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు మిసెస్ ఇండియా హేమలతా రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమ వ్యాఖ్యాత వండర్ బుక్ రికార్డ్స్ ఏపీ ప్రతినిధి వీరు మామ తన వాక్చాతుర్యంతో అలరించారు. లలిత జ్యూవెలర్స్ సౌజన్యంతో లేడీస్ పిక్నిక్ నిర్వహించారు.

ఆకలి అందరికీ ఒకటే..



ఏయూక్యాంపస్: ఆకలికి పేద, ధనిక తేడా లేదు. కడుపు మండితే తిండి తినాల్సిందే. కేవలం మనుషులకే కాకుండా పశుపక్షాదులకు సైతం ఇది అవసరం. మతి స్థిమితం లేని ఒక యాచకుడు శనివారం బీచ్ రోడ్డులో దర్శనమిచ్చాడు. ఒంటి నిండా మట్టి పూసుకుని ఉన్న అతను మధ్యాహ్నం ఎవరో ఇచ్చిన భోజనంతో ఆకలి నింపుకునే ప్రయత్నం చేస్తున్నాడు. ఫుట్‌పాత్‌పై కూర్చుని అన్నం తింటుండగా ఆకలితో ఉన్న కాకులు, పావురాలు సైతం పక్కనే చేరాయి. కిందపడే నాలుగు మెతుకులు నోటితో అందుకుని తమ క్షుద్బాధను తీర్చుకుని ఎగిరిపోయాయి.

- ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

శాంతి స్థాపనకు ప్రపంచ అఖండ భజన



అఖండ భజన చేస్తున్న సత్యసాయి భక్తులు

ఎంవీపీ కాలనీ: సత్య సాయిబాబా 99వ జయంతి వేడుకలను పురస్కరించుకొని ప్రపంచ శాంతి స్థాపన కోసం శ్రీ సత్యసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో గ్లోబల్ అఖండ భజన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎంవీపీ కాలనీ సత్యసాయి విద్యావిహార్ వద్ద ఉన్న శ్రీ సత్యసాయి ప్రేమసదన్ మందిరం వేదికగా సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు పీఆర్ఎస్ఎన్ నాయుడు, సత్యసాయి సిటీ సేవా సమితి కన్వీనర్ సీతారామరాజు సంప్రదాయ దీపాలు వెలిగించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రపంచ వ్యాప్తంగా శాంతి నెలకొనాలనే లక్ష్యంతో ఏటా నవంబర్ 2వ శనివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. భారతదేశంతోపాటు 150 ప్రపంచ దేశాల్లో ఏకకాలంలో అఖండ భజన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. తొలిరోజు 24 గంటలు నిర్విరామంగా భజన సాగింది. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు, నగరంలోని శ్రీ సత్యసాయి బాబా భక్తులు, అనుచరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.